ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్
Evening 6PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 128 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 +https:www.prajarepublic.com + వెల - 1/-
శుక్రవారం 13 డిసెంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# 'స్వర్ణాంధ్ర 2047' విజన్ డాక్యుమెంట్

## ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

**ఐశ్వర్య, ఆరోగ్య, ఆనందాంధ్రప్రదేశ్ (వెల్టీ, హెల్టీ, హ్యాపీ) సాకారమే లక్ష్యంగా 'స్వర్ణాంధ్ర 2047' విజన్ డాక్యుమెంట్ ను ఏపీ సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు.**

విజయవాడ, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్): ఐశ్వర్య, ఆరోగ్య, ఆనందాంధ్రప్రదేశ్ (వెల్టీ, హెల్దీ, హ్యాపీ) సాకారమే లక్ష్యంగా 'స్వర్ణాంధ్ర 2047 25 ఏపీ సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు.విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు పాల్గొన్నారు. 'పది సూత్రాలు.. ఒక విజన్' పేరిట డాక్యుమెంట్ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. జాతికి, రాష్ట్ర ప్రజలకు ఇది అంకితమని రాసి సంతకం చేశారు. అనంతరం పవన్కల్యాణ్, మంత్రి లోకేశ్తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు సంతకాలు చేశారు.



# ఇస్తాంబుల్ విమానాశ్రయంలో చిక్కుకున్న 400 మంది ఇండిగో ప్రయాణికులు..!

**ఇండిగో విమానాలు రద్దు కావడంతో వందల సంఖ్యలో ప్రయాణికులు ఇస్తాంబుల్ విమానాశ్రయంలో చిక్కుకుపోయారు.**

దిల్లీ, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్): దేశీయ విమానయాన సంస్థ ఇండిగో విమానాల్లో ప్రయాణించాల్సిన 400 మంది ప్రయాణికులు ఇస్తాంబుల్ లో చిక్కుకుపోయారు. తుర్కియే, దిల్లీ, ముంబయి మధ్య రాకపోకలు సాగించాల్సిన రెండు ఇండిగో విమానాలు రద్దు కావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ముందస్తు సమాచారం లేకుండా ఈ విమానాలు రద్దయ్యాయి. దాంతో ఇస్తాంబుల్ విమానాశ్రయం లో చిక్కుకుపోయిన ప్రయాణికులు ఆహారం, వసతులు లేక ఇబ్బందిపడ్డారు. తమకు ఎదురైన ఇబ్బందులను ప్రయాణికులు ఎక్స్ వేదికగా వెల్లడించారు.ముందస్తు సమాచారం ఇవ్వకుండా విమానాన్ని రద్దు చేశారని, తర్వాత 12 గంటలు రీషెడ్యూల్ చేశారని ఒక నెటిజన్ వెల్లడించారు. ఢిల్లీ నుంచి తుర్కియే రావాల్సిన ఇండిగో విమానం రద్దయిందని, కానీ తమకు ఎలాంటి వసతి కల్పించలేదని మరో ప్యాసింజర్ ఆందోళన వ్యక్తంచేశారు. దాంతో చల్లటి వాతావరణంలో తామ ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. తుర్కియే నుంచి నిన్న రాత్రి ముంబయికి బయల్దేరాల్సిన మరో విమానం మరుసటిరోజు ఉదయానికి రీషెడ్యూల్ అయిందని నెటిజన్ ఇంకొకరు వెల్లడించారు. దానిపై ఇండిగో ఎలాంటి ప్రకటన చేయలేదని, తుర్కిష్ ఎయిర్లైన్ సిబ్బంది నుంచి మాత్రం సమాచారం అందిందని పేర్కొన్నారు."అప్పటివరకు ఇస్తాంబుల్ విమానాశ్రయం లాంజ్లో ఉండాలని చెప్పారు. కానీ ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో అది ఏమాత్రం సరిపోలేదు. సరైన సదుపాయాలు లేకపోవడంతో గంటల తరబడి నిలబడాల్సి వచ్చింది. తగిన కమ్యూనికేషన్ లేదు. ప్రత్యామ్నాయ సదుపాయమూ కల్పించలేదు" అని ఓ ప్రయాణికుడు అసహనం వ్యక్తంచేశారు. నిర్వహణ కార్యకలాపాల్లో అంతరాయం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఇండిగో వెల్లడించింది.ఇటీవల ముంబయి నుంచి ఇంగ్లండ్లోని మాంచెస్టర్కు బయల్దేరిన విమానం కువైట్లో అత్యవసరంగా దిగిన సంగతి తెలిసిందే. దీంతో ఆ విమానంలోని భారతీయులు కువైట్ విమానాశ్రయంలోనే చిక్కుకుపోయారు. కొన్ని గంటల పాటు 100 మంది భారత్, పాక్ పౌరులు విమానాశ్రయంలో చిక్కుకొని తీవ్ర అవస్థలు పడ్డారు.



# పోలీసుల అదుపులో అల్లు అర్జున్..

**ప్రముఖ సినీనటుడు అల్లు అర్జున్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.**



హైదరాబాద్, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్): ప్రముఖ సినీనటుడు అల్లు అర్జునను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'పుష్ప 2' రిలీజ్ సందర్భంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్రోడ్లోని సంధ్య థియేటర్ వద్దతొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి నమోదైన కేసులో అల్లు అర్జున్ను నిందితుల్లో ఒకరిగా గుర్తించారు. ఇందులో భాగంగానే శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లిన పోలీసులు.. బన్నీని అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించారు.**సంధ్య థియేటర్ వద్ద అసలేం ఏం జరిగిందంటే?** అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పుష్ప2: ది రూల్. డిసెంబరు 5న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో డిసెంబరు 4న (బుధవారం) వివిధ ప్రాంతాల్లో ప్రీమియర్ షోలు ప్రదర్శించారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంశ్ యాదవ్ ఇటీవల వెల్లడించారు. "బుధవారం రాత్రి 9.40 గంటలకు పుష్ప-2 ప్రీమియర్ షోను ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య థియేటర్లోనూ ఏర్పాటు చేశారు. దీనికి అధిక సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు. అభిమానులతో పాటు సినిమాలో నటించిన కీలక నటులు థియేటర్కు వస్తారనే సమాచారం పోలీసులకు ఇవ్వలేదు. కనీసం థియేటర్ యాజమాన్యం కూడా మాకు సమాచారం ఇవ్వలేదు. సమాచారం ఇవ్వకపోగా.. యాజమాన్యం కూడా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదు. పబ్లికన్ను అదుపుచేసేందుకు థియేటర్ ఎంట్రీ, ఎగ్జిట్లో ఎలాంటి ప్రైవేటు సెక్యూరిటీని ఏర్పాటు చేయ-ంలేదు""రాత్రి 9.40 గంటలకు వ్యక్తిగత భద్రతా సిబ్బందితో సంధ్య థియేటర్ వద్దకు అల్లు అర్జున్ వచ్చారు. ఆ సమయంలో భద్రతా సిబ్బంది ప్రేక్షకులను అదుపుచేసే క్రమంలో నెట్టేయడం ప్రారంభించారు. అప్పటికే థియేటర్ లోపల, బయట ప్రేక్షకులతో కిక్కిరిసిపోయి ఉంది. ఈ క్రమంలో తోపులాట జరిగింది. దిల్సుఖ్నగర్కు చెందిన రేవతి కుటుంబం ఈ తొక్కిసలాటలో కిందపడిపోయారు. అధిక సంఖ్యలో అభిమానులు ఉండటంతో వారికి ఊపిరాడలేదు. వారిని గమనించిన పోలీసు సిబ్బంది వెంటనే బయటకు లాగారు. రేవతి కుమారుడు 13 ఏళ్ల శ్రీతేజకు సీపీఆర్ చేసి దుర్గాబాయి దేశముఖ్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రేవతి మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. శ్రీతేజను మరో ఆసుపత్రికి తరలించాలని అక్కడి వైద్యులు సూచించారు. ఈ ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం" అని డీసీపీ తెలిపారు. ఈ క్రమంలోనే అల్లు అర్జున్ను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## 'ఇది సంవిధాన్.. సంఘ్ బుక్ కాదు': లోక్ సభలో ప్రియాంక గాంధీ తొలి ప్రసంగం

**కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా లోక్ సభలో తొలి ప్రసంగం చేశారు.**

**రాజ్యాంగంపై చర్చ సందర్భంగా అధికార ఎన్డీయేపై ఆమె విమర్శల వర్షం కురిపించారు.**



దిల్లీ, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్): భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా లోక్సభలో ప్రత్యేక చర్చ జరుగుతోంది. ఇందులో విపక్షాల తరపున కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా చర్చను ప్రారంభించారు. ఎంపీగా ఇటీవలే పార్లమెంట్లో అడుగుపెట్టిన ఆమె.. లోక్సభలో ప్రసంగం చేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార భాజపా , ఆరెస్సెస్పై విమర్శలు చేశా-రు. రాజ్యాంగం అంటే సంఘ్ (ఆరెఎస్సెస్ను ఉద్దేశిస్తూ) బుక్ కాదని దుయ్యబట్టారు.

## హైకోర్టులో మోహన్ బాబు ముందస్తు బెయిల్ పిటిషన్

**సినీనటుడు మోహన్ బాబు తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.**



హైదరాబాద్, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్): సినీనటుడు మోహన్ బాబు తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. కుటుంబ వివాదం నేపథ్యంలో జల్పల్లిలోని నివాసం వద్దకు వెళ్లిన జర్నలిస్టు దాడి ఘటనలో ఆయనపై పహాడీ షరీఫ్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మోహన్ బాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసులు తదుపరి దర్యాప్తు చేపట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్లో ఆయన కోరారు.

# 18వేల మంది భారతీయులకు .. అమెరికా 'డీపోర్టేషన్' ముప్పు!

**అక్రమ వలసదారులకు సంబంధించి అమెరికా ఇమిగ్రేషన్ అధికారులు జాబితా రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.**



డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్): అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టిన వెంటనే అక్రమ వలసదారులపై చర్యలు చేపడతానని వాగ్దానం చేశారు. వీటికి అనుగుణంగానే అధికారిక ఆదేశాలు ఇచ్చేందుకు సిద్ధమవుతుండగా.. అమెరికా ఇమిగ్రేషన్ అధికారులు కూడా అటువంటి వారి జాబితా రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో 18 వేల మంది ప్రవాస భారతీయులు అమెరికా డీపోర్టేషన్ ముప్పు ఎదుర్కొంటున్నట్లు సమాచారం.అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వారికి సంబంధించి యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్ఫోర్స్మెంట్ ఇటీవల గణాంకాలు విడుదల చేసింది. మొత్తంగా 14.45 లక్షల మంది ఈ జాబితాలో ఉండగా.. 2,61,651 మందితో హోండరస్ మొదటిస్థానంలో నిలిచింది. గ్వాటెమాలా నుంచి రెండున్నర లక్షల మంది ఉండగా.. మెక్సికో, ఎల్ సాల్వెడార్ దేశాలకు చెందిన వారి సంఖ్య అధికంగా ఉంది. ఈ జాబితాలో 17,940 మంది భారతీయులు కూడా ఉన్నట్లు ఐఈసీ నివేదిక పేర్కొంది. దాదాపు 37 వేల మంది చైనీయులు ఈ ముప్పును ఎదుర్కొంటున్నారు.అమెరికాలో ప్రస్తుతం లక్షలాది మంది భారతీయులు అనధికారికంగా ఉంటున్నట్లు అంచనా. సరైన పత్రాలు లేని వీరంతా చట్టబద్ధత కోసం ప్రయత్నిస్తున్నారు. ఐసీఈ నుంచి క్లియరెన్స్ వచ్చేందుకు ఏళ్ల సమయం పడుతున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో గత మూడేళ్లలో అక్రమ మార్గాల్లో అగ్రరాజ్యంలో అడుగుపెట్టేందుకు ప్రయత్నిస్తూ వేల మంది భారతీయులు పట్టుబడటం ఆందోళనకర విషయం.అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధమవుతోన్న ట్రంప్.. బాధ్యతలు చేపట్టిన వెంటనే భారీ స్థాయిలో డిపోర్టేషన్ ఆపరేషనన్ను చేపడతానని స్పష్టం చేస్తున్నారు. ఈ విషయంలో భారత అధికారుల నుంచి సరైన సహకారం లేదని ఐసీఈ పేర్కొనడం ప్రవాసుల్లో ఆందోళనకు కారణమైంది. వీటిని పరిష్కరించేందుకు దౌత్యపరమైన మార్గాలను ఇరు దేశాలు అన్వేషిస్తున్నట్లు సమాచారం.ఇదిలాఉంటే, చట్టబద్ధంగా వలస వచ్చేవారికి మార్గం సులువు చేస్తానని కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. అమెరికాకు అక్రమంగా వలస వచ్చిన తల్లిదండ్రుల సంతానం (డ్రీమర్స్) లో చాలామంది ఇక్కడే పుట్టి పెరిగారని, వారిలో అనేక మంది గొప్ప ఉద్యోగాలు, వృత్తులు చేస్తున్నారని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. వారి సమస్యను పట్టించుకుంటానని ట్రంప్ చెప్పడం భారతీయులకు కాస్త ఊరట కలిగించే విషయం.

## సరికొత్త చరిత్రకు విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ నాంది: సీఎం చంద్రబాబు



విజయవాడ, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్): స్వర్ణాంధ్ర విజన్ 2047.. రాష్ట్ర దశ, దిశను మారుస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డాక్యుమెంట్ ఆవిష్కరణ సరికొత్త చరిత్రకు నాంది అన్నారు. వైకాపా హయాంలో ఊహించిన దానికంటే ఎక్కువ విధ్వంసం జరిగిందని చెప్పారు. పరిపాలన ప్రారంభించిన 6 నెలల్లోనే విజన్ డాక్యుమెంట్ రూపొందించామన్నారు."తెలుగుజాతి ప్రపంచంలోనే నంబర్ 1గా నిలవాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నాం. దేశంలోనే ఏపీ అగ్రగామిగా నిలవాలనే సంకల్పంతో ఉన్నాం. నేడు 3 వేల డాలర్ల కంటే తక్కువగా తలసరి ఆదాయం ఉంది. 2047 నాటికి 42 వేల డాలర్లకు తలసరి ఆదాయం పెరగాలన్నది లక్ష్యం. విజన్ డాక్యుమెంట్ కోసం 17 లక్షల మంది తమ ఆలోచనలు పంచుకున్నారు. సంస్కరణల ద్వారానే ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకురాగలం.




అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషం స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యం. పేదరికం లేని సమాజం అనేది మంత్రంగా తయారు కావాలి. ఆర్థిక అసమానతలను తగ్గించాలి. పీ4 విధానంలో పేదరిక నిర్మూలన చేయాలి. నాడు విజన్ 2020 సంకల్పంలో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఐటీ ఉద్యోగి వచ్చారు. విజన్ 2047లో భాగంగా ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్త తయారు కావాలి. ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యం. పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ ఉద్యోగాలిప్పించే దిశగా కృషి చేస్తున్నాం. నైపుణ్య శిక్షణ ఇప్పించి.. మానవ వనరులను అభివృద్ధి చేస్తాం. నీటి భద్రతకు ప్రాధాన్యమివ్వాలనే కరవు రహిత ఏపీకి శ్రీకారం చుడుతున్నాం. వ్యవసాయానికి సాంకేతికతను అనుసంధానించే అంశాన్ని విజన్లో చేర్చాం" అని చంద్రబాబు అన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# చేనేత వస్త్ర ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మధురవాడ శిల్పారామంలో రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శనను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని శుక్రవారం ఉదయం ప్రారంభించారు.



**కొమ్మాది, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్):** మధురవాడ శిల్పారామంలో రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శనను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత వస్త్ర కళాకారులు రూపొందించిన ఉత్పత్తులను మధ్యవర్తులు లేకుండా నేరుగా విక్రయించుకునేలా ప్రభుత్వం ఇటువంటి వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేసిందని, తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాలతో పాటు దేశంలో ఉన్న వివిధ రాష్ట్రాలకు చెందిన 60 మందికి పైగా కళాకారులు వివిధ రకాల ఉత్పత్తులను ఈ మేళాలో అందుబాటులో ఉంచారని అన్నారు. సరసమైన ధరలకు లభించే ఈ ఉత్పత్తులను ప్రజలంతా కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలని గంటా కోరారు. చేనేత కళాకారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం చేనేత కళాకారులకు అనేక సంక్షేమ పథకాలు అందేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శిల్పారామం ఆర్ట్ క్రాఫ్ట్ కల్చరల్ సొసైటీ చైర్ పర్సన్ మంజులారెడ్డి, ముఖ్య కార్యనిర్వహణాధికారి వి. స్వామి నాయుడు, ఏవో విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీభువనేశ్వరీ పీఠాన్ని సందర్శించిన వెంకయ్య నాయుడు

కేసరపల్లి శ్రీభువనేశ్వరీ పీఠాన్ని సందర్శించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు.



**గన్నవరం, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్):** కేసరపల్లి శ్రీభువనేశ్వరీ పీఠాన్ని సందర్శించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు. హైదరాబాద్ నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుని, నేరుగా శ్రీభువనేశ్వరీ పీఠానికి చేరుకున్నారు. భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, పలువురు నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి కమలానంద భారతి స్వామిని మర్యాద పూర్వకంగా కలిశారు.

# పెద్ద చెరువులో యుద్ధ ట్యాంకుల ట్రయల్ రన్

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ పెద్ద చెరువులో శుక్రవారం యుద్ధ ట్యాంకుల ట్రయల్ రన్ నిర్వహించారు.



**సంగారెడ్డి పట్టణం, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్):** సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ పెద్ద చెరువులో శుక్రవారం యుద్ధ ట్యాంకుల ట్రయల్ రన్ నిర్వహించారు. కంది మండలం ఎద్దు మైలారంలోని ఆయుధ కర్మాగారంలో వీటిని తయారు చేశారు. ఆయుధ కర్మాగారం అధికారులు, ఇండియన్ ఆర్మీ అధికారుల సమక్షంలో ట్రయల్ రన్ కొనసాగింది. నీటిలో తేలియాడుతూ పరుగులు తీయడం వాహనాల ప్రత్యేకత అని ఆయుధ కర్మాగారం చీఫ్ జనరల్ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. తమ కర్మాగారం నుంచి ప్రతి సంవత్సరం 120 వాహనాలను ఇండియన్ ఆర్మీకి సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. నాణ్యమైన యుద్ధ ట్యాంకర్లను ఆర్మీకి అందజేస్తున్నామని తెలిపారు.

# ప్రజలను అవమానించేలా తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు జీవో: ఎమ్మెల్సీ కవిత

తెలంగాణ తల్లి ఏర్పాటుపై రేవంత్రెడ్డి సర్కారు గెజిట్ ఇవ్వడం దారుణమని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు.



**హైదరాబాద్, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ తల్లి ఏర్పాటుపై రేవంత్రెడ్డి సర్కారు గెజిట్ ఇవ్వడం దారుణమని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి విగ్రహాలు పెట్టుకుంటామని.. జీవో ఇస్తేనే అవి పెడతామా అని ప్రశ్నించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో స్ఫూర్తి నింపిన తెలంగాణ తల్లి విగ్రహాలను భారాస హయాంలో ఏర్పాటు చేశామన్నారు."ప్రజలను అవమానించేలా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై జీవో ఇచ్చారు. అధికార పార్టీది తెలంగాణ వాదం కాదు.. కాంగ్రెస్ వాదం. వాళ్లకు పార్టీ ప్రయోజనాలే తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఇందిరా గాంధీ, సోనియా, రాహుల్ కూడా బతుకమ్మ ఆడారు. భారాస హయాంలో దాన్ని రాష్ట్ర పండగగా గుర్తించాం. దీనికి సంబంధించి జీవో కూడా జారీ చేశాం. బతుకమ్మను అవమానించేలా మాట్లాడిన మంత్రులపై ఏం చర్యలు తీసుకుంటారు? జీవో ఇస్తేనే భరతమాత విగ్రహాలు పెట్టుకుంటామా?" అని కవిత ప్రశ్నించారు.

# ఏపీ అభివృద్ధికి సీఎం చంద్రబాబు అవిశ్రాంత కృషి : మంత్రి పయ్యావుల

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ రూపకల్పన వెనక సీఎం చంద్రబాబు అవిశ్రాంత కృషి ఉందని ఏపీ ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.



**విజయవాడ, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్):** స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ రూపకల్పన వెనక సీఎం చంద్రబాబు అవిశ్రాంత కృషి ఉందని ఏపీ ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ప్రతిఒక్కరి భవిష్యత్తు బాగుండాలనే లక్ష్యంతో ఈ డాక్యుమెంట్ను రూపొందించినట్లు చెప్పారు. దేశంలో విజన్ డాక్యుమెంట్కు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని, విజన్ 2020 ఫలాలు నేడు కళ్ల ముందు కనిపిస్తున్నాయన్నారు. పరిపాలన అంటే పారిశ్రామికవేత్తలను తరిమేసి ప్రజావేదికలు కూల్చటం కాదని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని హితవు పలికారు. విశ్వనగరంగా మారిన హైదరాబాద్ నాడు విజన్ 2020 ఆలోచనల నుంచి పుట్టిందేనని పయ్యావుల గుర్తుచేశారు. అదేవిధంగా రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపేందుకు సీఎం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఏపీని మళ్లీ నంబర్వన్గా నిలబెట్టేందుకే ప్రయత్నాలు సాగుతున్నాయని చెప్పారు.ఇదీ చదవండి: జర్నలిస్టుకు మోహన్ బాబు క్షమాపణలు.. ఎక్స్ వేదికగా లేఖ విడుదలఐటీ, డ్రిప్ ఇరిగేషన్ గురించి 30 ఏళ్ల క్రితం చంద్రబాబు చేసిన ఆలోచనలు ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపాయని మంత్రి పయ్యావుల ఆనందం వ్యక్తంచేశారు. రేపటి ఎన్నికల గురించి ఆలోచించే రాజకీయ నాయకుడు కాదు, రేపటితరం గురించి ఆలోచించే రాజనీతిజ్ఞుడని చంద్రబాబు అని మంత్రి కొనియాడారు. స్వర్ణాంధ్ర ఏ2047 విజన్ను పది సూత్రాలతో సీఎం ఆవిష్కరించారు. స్వర్ణాంధ్ర 2047 జాతికి, రాష్ట్ర ప్రజలకు అంకితం అంటూ ఉన్న విజన్ డాక్యుమెంట్పై సీఎం చంద్రబాబుతోపాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, స్థానిక ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోండా ఉమా, ఉన్నతాధికారులు సంతకాలు చేశారు.

# కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి హౌస్ అరెస్ట్

మాజీ ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పులివెందులలో వైకాపా అధ్యక్షుడు జగన్ క్యాంపు కార్యాలయానికి ఆయన్ను తరలించారు.



**వేముల, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్):** మాజీ ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పులివెందులలో వైకాపా అధ్యక్షుడు జగన్ క్యాంపు కార్యాలయానికి ఆయన్ను తరలించారు.వివరాల్లోకి వెళితే.. వైఎస్ఆర్ జిల్లా వేముల మండలం గొల్లల గూడూరు గ్రామానికి చెందిన వైకాపా కార్యకర్త ఈసీ మహేశ్వర్రెడ్డి నీటి పన్ను చెల్లించేందుకు గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. కొందరు వ్యక్తులు అడ్డుకుని సంబంధిత పత్రాలను చించివేసినట్లు సమాచారం. దీంతో శుక్రవారం ఉదయం ఎంపీ అవినాష్రెడ్డి వేముల పోలీస్ స్టేషన్కు వెళ్లి ఎస్సైతో చర్చించారు. వైకాపా కార్యకర్తలు అక్కడికి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో గొడవలు జరిగే అవకాశముందని పోలీసులు అవినాష్ను అదుపులోకి తీసుకున్నారు. తమ వాహనంలోనే పులివెందులలోని జగన్ క్యాంపు కార్యాలయానికి తరలించారు. సీఐ నరసింహులు ఆధ్వర్యంలో ఎంపీని గృహనిర్బంధం చేశారు.

# భారాస మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డికి ఈడీ నోటీసులు

భూదాన్ భూముల కుంభకోణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది.





**హైదరాబాద్, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్):** భూదాన్ భూముల కుంభకోణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారాసకు చెందిన నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్రెడ్డి, మరో ముగ్గురికి ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు ఇచ్చింది. మాజీ ఎమ్మెల్యేతో పాటు వంశీరాం బిల్డర్స్ సుబ్బారెడ్డి, మరో ఇద్దరికి నోటీసులు జారీ చేసింది. డిసెంబర్ 16న విచారణకు హాజరుకావాలని ఈడీ పేర్కొంది.

# హైదరాబాద్‌లో దారుణం ..భార్య, కుమారుడిని చంపి భర్త ఆత్మహత్య

నగరంలోని బేగంబజార్‌లోదారుణం చోటు చేసుకుంది. భార్య, కుమారుడిని చంపి భర్త సిరాజ్ ఆత్మహత్య చేసుకున్నాడు.



**హైదరాబాద్, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్):** నగరంలోని బేగంబజార్ లో దారుణం చోటు చేసుకుంది. భార్య,కుమారుడిని చంపి భర్త సిరాజ్ ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య హేలియాను గొంతు కోసి, కుమారుడ్ హైజాన్ ను గొంతు నులిమి హతమార్చాడు. అనంతరం సిరాజ్ ఉరేసుకుని తనువు చాలించాడు. ఈ ఘటనను చూసి అతడి పెద్ద కుమారుడు భయంతో పారిపోయాడు. కుటుంబ కలహాలే దీనికి కారణమని పోలీసులు అనుమానం వ్యక్తం చేస-్తున్నారు. సిరాజ్ కుటుంబం ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చినట్లు గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.గురువారం రాత్రి సిరాజ్ దంపతుల మధ్య గొడవ జరిగిందని అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్ తెలిపారు. భార్యపై అనుమానంతో హత్య చేసినట్లు లేఖలో ఉందని చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. బేగంబజార్లో లోని బ్యాంగిల్ స్టోర్ సిరాజ్ పని చేస్తున్నట్లు చెప్పారు.

# రఘురామకు చిత్రహింసల కేసు ..ఒంగోలుకు విజయ్పాల్ తరలింపు


రఘురామకృష్ణ రాజుకు కస్టడీలో చిత్రహింసల కేసులో నిందితుడిగా ఉన్న సీఐడీ విశ్రాంత ఎస్పీ విజయపాల్ను ఒంగోలు తరలించారు.



**గుంటూరు, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్):** రఘురామకృష్ణ రాజుకు కస్టడీలో చిత్రహింసల కేసులో నిందితుడిగా ఉన్న సీఐడీ విశ్రాంత ఎస్పీ విజయ్ పాల్ ను ఒంగోలు తరలించారు. పోలీసు కస్టడీకి అనుమతిస్తూ గుంటూరు జిల్లా ప్రత్యేక కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.దీంతో శుక్రవారం ఉదయం గుంటూరు జైలు నుంచి విజపాల్ను ఒంగోలు తీసుకెళ్లారు. అంతకుముందు గుంటూరు జీజీహెచ్ లో ఆయనకు వైద్యపరీక్షలు నిర్వహించారు. విజపాల్ను శుక్ర, శనివారాల్లో ప్రకాశం జిల్లా ఎస్పీ విచారించనున్నారు.

# నష్ట పరిహారం అందలేదని .. సెల్ఫీ వీడియో తీసుకొని వ్యక్తి ఆత్మహత్య

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం పోర్టుకు భూములిచ్చి రెండేళ్లు అవుతున్నా ఇంకా నష్ట పరిహారం అందలేదంటూ ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు.



**కావలి, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్):** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం పోర్టుకు భూములిచ్చి రెండేళ్లు అవుతున్నా ఇంకా నష్ట పరిహారం అందలేదంటూ ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. చేవూరు గ్రామానికి చెందిన నక్కల వినోద్ సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఉరేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున కావలిలో చోటు చేసుకుంది. మృతదేహాన్ని చేవూరు గ్రామానికి తరలించారు. ఆత్మహత్యకు పోర్టు భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి కారణమని బాధితుడు వీడియోలో ఆరోపించాడు. తాను తెదేపాలో చేరినందుకే డబ్బులు ఇవ్వకుండా వేధించారని

# సంగారెడ్డి జిల్లాలో భారీగా డ్రగ్స్ పట్టివేత

సంగారెడ్డి జిల్లాలో భారీగా డ్రగ్సు పట్టుకున్నారు.మొగుడంపల్లి మండలం మాడిగి అంతర్రాష్ట్ర చెకోపోస్టు వద్ద తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు.



**మొగుడంపల్లి, డిసెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్):** సంగారెడ్డి జిల్లాలో భారీగా డ్రగ్స్ను పట్టుకున్నారు మొగుడంపల్లి మండలం మాడిగి అంతర్రాష్ట్ర చెకోపోస్టు వద్ద తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ తరలిస్తున్నారనే ముందస్తు సమాచారంతో అధికారులు ఈ సోదాలు చేశారు. డీఆర్ఐ, నార్కొటిక్ డ్రగ్స్ కంట్రోల్, సెంట్రల్ విజిలెన్స్ బృందాలు ఇందులో పాల్గొన్నాయి. లారీలో తరలిస్తుండగా డ్రగ్స్‌స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్, క్లీనర్ పరారయ్యారు. పట్టుబడిన మాదక ద్రవ్యాల విలువ రూ.50 కోట్లు ఉంటుందని సమాచారం. వీటిని ఏపీలోని ఓడరేవు నుంచి ముంబయి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. లారీని చిరాగ్పల్లి పోలీసు స్టేషన్కు తరలించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1048 : ఒక పర్షియన్ 'తజకి' ముస్లిం, బహుముఖ ప్రజ్ఞాశాలి అల్ బెరూని మరణం (జ.973).
- 1952 : దక్షిణ భారతీయ నటీమణి లక్ష్మి జననం.
- 1960 : తెలుగు సినిమా కథానాయకుడు దగ్గుబాటి వెంకటేష్ జననం. (చిత్రంలో)
- 1968 : నాసా అంతరిక్షనౌక అపోలో 8లో ప్రయాణించిన వ్యోమగాములు చంద్రుడి కక్ష్యలో ప్రవేశించి ఆ ఘనత సాధించిన తొలి మానవులుగా చరిత్ర పుటలకెక్కారు.
- 1989 : అమెరికా గాయకురాలు, పాటల రచయిత టేలర్ స్విఫ్ట్ జననం.
- 1994 : భారతీయ కమ్యూనిస్టు నేత, మాజీ భారత రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి సోదరుడు నీలం రాజశేఖరరెడ్డి మరణం (జ.1918).
- 2001 : సాయుధ ఇస్లామిక్ తీవ్రవాదులు భారత పార్లమెంటుపై దాడి చేసారు.
- 2007 : స్వాతంత్ర్య సమరయోధురాలు, భారత జాతీయ కాంగ్రెసు నాయకురాలు తేళ్ల లక్ష్మీకాంతమ్మ మరణం (జ.1924)


అల్ బెరూని


లక్ష్మి


దగ్గుబాటి వెంకటేష్


అపోలో 8లో


స్విఫ్ట్


నీలం సంజీవరెడ్డి


భారత పార్లమెంటు


లక్ష్మీకాంతమ్మ

# 'డాకుస్ రేజ్...: 'డాకు మహారాజ్ ఫస్ట్ సింగిల్ ప్రోమో రిలీజ్

**బాలకృష్ణ హీరోగా నటిస్తోన్న 'డాకు మహారాజ్ నుంచి తొలి పాట ప్రోమో విడుదలైంది.**



బాలకృష్ణ కథానాయకుడిగా దర్శకుడు బాబీ తెరకెక్కిస్తోన్న చిత్రం 'డాకు మహారాజ్'శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలు. బాబీ దేవోల్, చాందిని చౌదరి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈసినిమా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి తొలి పాట ప్రోమో విడుదలైంది. 'దేగ దేగ' అంటూ సాగే ఈ పాటకు అనంత్ శ్రీరామ్ లిరిక్స్ అందించారు. నాకాశ్ అజీజ్ దీనిని అలపించారు. తమన్ స్వరాలు అందించారు.

# మీను.. అంటోన్న వెంకటేశ్ .. సెకండ్ సింగిల్ ప్రోమో రిలీజ్

**'సంక్రాంతికి వస్తున్నాం' నుంచి రెండో పాట రానుంది. తాజాగా దీని ప్రోమో విడుదలైంది.**




వెంకటేశ్- అనిల్ రావిపూడి కాంబోలో రానున్న చిత్రం 'సంక్రాంతికి వస-్తున్నాం'ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి కథానాయికలు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమాలోని గోదారి గట్టు పాటను విడుదల చేయగా.. అది మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. ఇప్పుడు మూవీ యూనిట్ రెండో పాటతో అలరించేందుకు సిద్ధమైంది . వెంకటేశ్ పుట్టినరోజు సందర్భంగా తాజాగా సెకండ్ సింగిల్ ప్రోమో విడుదలైంది. ఈ వీడియో చూశారా: "పుష్ప 2' సక్సెస్.. క్రెడిట్ మొత్తం ఆయనకే ఇచ్చేస్తా!: అల్లు అర్జున్

## 'పుష్ప 2' రివ్యూ.. బాలీవుడ్ చూసి నేర్చుకోవాలి: సీనియర్ నటుడి విమర్శలు

**అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2 ది రూల్ పై తన అభిప్రాయాన్ని తెలియజేశారు బాలీవుడ్ సీనియర్ నటుడు ముఖేశ్ ఖన్నా . ఈ సినిమా అద్భుతంగా ఉందని చెప్పిన ఆయన బాలీవుడ్ చిత్రాలపై తీవ్ర విమర్శలు చూశారు.**



అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2 ది రూల్ అద్భుతంగా ఉందన్నారు బాలీవుడ్ సీనియర్ నటుడు ముఖేశ్ ఖన్నా. ప్రతి సన్నివేశాన్ని చూడచక్కగా తెరకెక్కించారని చెప్పారు. పెట్టిన ప్రతి రూపాయికీ న్యాయం జరిగిందని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈమేరకు తన యూట్యూబ్ ఛానల్ వేదికగా స్పెషల్ వీడియో షేర్ చేశారు."కేవలం డబ్బుతోనే ఈ సినిమా తెరకెక్కించలేదు. విజన్, సరైన ప్రణాళికతో దీనిని రూపొందించినట్లు సినిమా చూస్తే తెలుస్తోంది. పెట్టిన ప్రతి రూపాయి స్క్రీన్పై కనిపిస్తుంది. లార్జర్ దేన్ లైఫ్ చిత్రాలను నమ్మకం పెట్టి తెరకెక్కిస్తే ప్రేక్షకులు దానిలో లాజిక్స్ వెతకరు. అల్లు అర్జున్ నటించిన గత చిత్రాలను పెద్దగా నేను చూడలేదు. ఈ సినిమా చూసిన తర్వాత ఆయన గత చిత్రాలు చూడాలనే ఆలోచన వచ్చింది. ఈ ప్రదర్శన చూసిన తర్వాత 'శక్తిమాన్' పాత్రకు ఆయన అయితేనే సరైన న్యాయం చేయగలరని అనిపిస్తుంది" అన్నారు.ఇదీ చదవండి: దేశమంతా గర్వంతో వెలిగిపోతోంది.. గుకేశ్కు సినీ ప్రముఖుల విషెస్ అనంతరం బాలీవుడ్పై విమర్శల వర్షం కురిపించారు. "దక్షిణాది చిత్రాల నుంచి హిందీ చిత్ర పరిశ్రమకు చెందిన దర్శక, నిర్మాతలు ఎన్నో విషయాలు నేర్చుకోవాలి. ఉదాహరణకు.. ఈ సినిమాలో భార్యాభర్తల సన్నివేశాలను చూడచక్కగా చిత్రీకరించారు. ఎక్కడా అభ్యంతరకరంగా అనిపించలేదు. కానీ, బాలీవుడ్లో అలాకాదు. దంపతుల మధ్య ఏదైనా సీన్స్ ఉంటే వాటికి అశ్లీలత జోడించి చూపిస్తారు. హద్దులు మీరి తెరకెక్కిస్తారు. అలాంటి సన్నివేశాల వల్ల డబ్బులు అయితే సంపాదించవచ్చు కానీ.. అది ఎంతవరకు సరైనది" అని ముఖేశ్ ప్రశ్నించారు.అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ తెరకెక్కించిన 'పుష్ప 2 ది రూల్' ప్రపంచవ్యాప్తంగా దూసుకెళ్తోంది. విడుదలైన ఆరు రోజుల్లోనే రూ.1000 కోట్ల గ్రాస్ వసూలుచేసి ఇది సరికొత్త రికార్డులు సృష్టించింది. అతి తక్కువ సమ-యంలో రూ.1000 కోట్ల క్లబ్లోకి అడుగుపెట్టిన సినిమాగా ఇది పేరు సొంతం చేసుకుంది. సుకుమార్ డైరెక్షన్, అల్లు అర్జున్ యాక్టింగ్కు అంతటా ప్రశంసలు దక్కుతున్నాయి.

రిపబ్లిక్ సినిమా CINEMA

## ఆ సంఘటన తర్వాత అమ్మవాళ్లను సెట్ కు పిలవలేదు:సందీప్ కిషన్

**టాలీవుడ్ తో పాటు కోలీవుడ్లో నూ వరుస సినిమాలు చేస్తున్నారు నటుడు సందీప్ కిషన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న సవాళ్ల గురించి మాట్లాడారు.**



'రాయన్'తో కోలీవుడ్లోనూ విశేష ఆదరణ సొంతం చేసుకున్నారు నటుడు సందీప్ కిషన్ ప్రస్తుతం టాలీవుడ్లోనే కాకుండా కోలీవుడ్లోనూ వరుస సినిమాలు చేస్తున్న ఆయన తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న సవాళ్లు, ఇబ్బందుల గురించి మాట్లాడారు. సినిమాల్లోకి అడుగుపెడతానని తొలిసారి ఇంట్లోవాళ్లకు చెప్పినప్పుడు వారంతా ఆశ్చర్యపోయారని అన్నారు. తన నిర్ణయాన్ని మొదట్లో అంగీకరించలేదని చెప్పారు."మాది ఎగువ మధ్యతరగతి కుటుంబం. నేను ఎంబీఏ చదువుకున్నా. కాలేజీలో ఉన్నప్పుడు సినిమాలు ఎక్కువగా చూసేవాడిని. నటుడిని కావాలనుకున్నప్పుడు కుటుంబసభ్యులు మొదట అంగీకరించలేదు. తర్వాత నా ఇష్టాన్ని అర్థం చేసుకున్నారు. అమ్మ ఇచ్చిన రూ.25 వేలతో ఫొటోషూట్ చేయించా. ఆ తర్వాత ఆడిషన్స్ వేటలో పడ్డా. తమిళం, తెలుగు ద్విభాషా చిత్రంలో నటుడిగా అవకాశం వచ్చింది. కొన్ని రోజుల షూట్ తర్వాత అది ఆగిపోయింది. దర్శకుడు గౌతమ్ మేనన్ వద్ద అసిస్టెంట్ దర్శకుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టా. అదే సమయంలో 'భద్ర' తమిళంలో రీమేక్ చేస్తున్నారని తెలిసి.. చిన్న రోల్ వచ్చినా చేద్దామని ఆడిషన్కు వెళ్లా. అది జరగలేదు. 'హ్యాపీడేస్' ఆడిషన్కు వెళ్లా. వాళ్లకు నేను నచ్చా. కాకపోతే ఆ రోల్కు నేను సెట్ కాకపోవడంతో ఆఫర్ రాలేదు. దాదాపు రెండేళ్లపాటు ఆడిషన్స్.. అవకాశం వచ్చినట్టే వచ్చి చేజారిపోయేవి. అలాంటి సమయంలో 'ప్రస్థానం' వచ్చింది" అని సందీప్ తెలిపారు."నాకు ఆత్మాభిమానం ఎక్కువ. నన్ను ఎవరైనా తక్కువ చేసి మాట్లాడితే నాకు వెంటనే కోపం వచ్చేస్తుంది. 'స్నేహగీతం' సినిమా షూట్కు మా నాన్న వచ్చారు. అందరూ కలిసి భోజనం చేస్తున్నప్పుడు నాన్న ప్లేట్లో చికెన్ అయిపోయింది. సర్వ్ చేస్తున్న వ్యక్తిని పిలిచి.. చికెన్ వేయమని అడిగా. దానికి అతడు గిన్నె చూపించి.. 'ఇదే ఉంది అందరూ తినాలి' అన్నాడు. ఆ మాట నన్ను ఇబ్బంది పెట్టింది. ఆ తర్వాత నుంచి అమ్మవాళ్లను ఎప్పుడూ నా సినిమా సెట్కు పిలవలేదు. ఒకవేళ వాళ్లు నాకు చెప్పకుండా వస్తే.. సుమారు 15 నిమిషాల్లో అక్కడినుంచి పంపించి వేస్తాను" అని సందీప్ అన్నారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# ఆ పిల్లాడే ఇప్పుడు కింగ్

## :ఫొటో షేర్ చేసిన ఆనంద్ విశ్వనాథన్

**గుకేశ్ ఇప్పుడు చెస్ ప్రపంచంలో హాట్ టాపిక్. తన అద్భుత ఆటతీరుతో ఛాంపియన్ గా నిలిచాడు.**



చరిత్రను తిరగరాస్తూ డి గుకేశ్ సంచలన ప్రదర్శనతో ప్రపంచ చెస్ ఛాంపియన్ గా అవతరించాడు. 18 ఏళ్లకే ఈ ఘనతను సాధించి చదరంగంలో అరుదైన ప్రతిభను సొంతం చేసుకున్నాడు. చివరి రౌండ్ వరకూ ఉత్కంఠభరితంగా సాగిన ప్రపంచ చెస్ ఛాంపియన్షిప్లో డింగ్ లిరెన్పై గుకేశ్ విజయం సాధించాడు. ఇప్పటికే తనకు విషెస్ ను తెలియజేసిన చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ సోషల్ మీడియాలో మరో పోస్టుతో ఆకట్టుకున్నాడు. గుకేశ్ చిన్ననాటి ఫొటోను ఆనంద్ షేర్ చేశాడు. "ఇప్పుడీ పిల్లాడే కింగ్ అంటూ క్యాప్షన్ జోడించాడు. అండర్ -13 పోటీల్లో భాగంగా ఆనంద్ చేతులమీదుగా గుకేశ్ ఐదేళ్ల కిందట ఛాంపియన్ బహుమతిని అందుకొన్నాడు. ఆ ఫొటోనే తాజాగా ఆనంద్ షేర్ చేశాడు.అక్కడే డింగ్ లిరెన్ దొరికిపోయాడుదాదాపు 40 ఏళ్ల కిందట కాస్పరోవ్ నమోదు చేసిన రికార్డును భారత యువ చెస్ ప్లేయర్ గుకేశ్ బద్దలుకొట్టాడు. అప్పటివరకు ఉన్న రికార్డు 22 ఏళ్ల 6 నెలల 27 రోజులు. కానీ, గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్ గా 18 ఏళ్ల 8 నెలల 14 రోజుల వయసులోనే నిలిచాడు. డింగ్ లిరెన్తో జరిగిన హోరాహోరీ పోరులో 7.5 పాయింట్లను సాధించి గుకేశ్ విజేతగా నిలిచాడు. 13 రౌండ్ల వరకూ పాయింట్లపరంగా సమంగా నిలిచారు. అయితే, చివరి రౌండ్లో అద్భుత విజయంతో గుకేశ్ ఛాంపియన్గా మారిపోయాడు. ఈ రౌండ్లోనూ చివరివరకూ ఇరువురూ తీవ్రంగా తలపడ్డారు. కానీ, ఆఖర్లో లిరెన్ చేసిన పొరపాటు గుకేశ్కు కలిసొచ్చింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా దూకుడు ప్రదర్శించిన భారత యువ చెస్ ప్లేయర్ ప్రత్యర్థిని మట్టి కరిపించాడు. చివరికి లిరెన్ ఓటమిని అంగీకరించక తప్పలేదు.

## రిలేషన్ షిప్స్




భార్యభర్తల బంధం ఎంతో ప్రత్యేకమైంది. ఇద్దరు వ్యక్తులు తమ జీవితమంతా కలిసి గడపాలి. ఒకరికొకరు మద్దతు ఇచ్చుకోవాలి. ఈ సంబంధం ప్రేమ, కోపం, బాధ్యతలతో నిండి ఉంటుంది. భార్యభర్తల బంధంలో గొడవలు, అలకలు కూడా ఉంటాయి. ఎన్నో వివాదాలు ఉన్నప్పటికీ.. ప్రేమ మాత్రం అలానే ఉంటుంది. అయితే, బంధంలో ఏ గొడవ వచ్చినా.. అవి పరిష్కారం అవ్వడం అనేది భార్యభర్తలు ఎలా ప్రవర్తించారన్న దానిపై ఆధారపడి ఉంటుంది.అయితే, కొందరు భర్తలు తమ భార్యలపై చాలా ప్రేమ చూపిస్తారు. గొడవలు వచ్చినా సరే.. వారు మాత్రం భార్యను వదిలిపెట్టరు. భార్య మీద ప్రేమను చూపిస్తూనే ఉంటారు. భర్తకి ఉండే అలవాట్లతో అతను ఎలాంటి వాడో చెప్పేయచ్చు. కొన్ని లక్షణాలుంటే కచ్చితంగా మంచి భర్త అవుతాడని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ మంచి భర్తకి ఉండే లక్షణాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.



# భార్య కోసం మంచి భర్త ఈ పనులు చేస్తారు .. ఆమె సంతోషమే ముఖ్యం..

### ప్రేమ వ్యక్తపర్చడం..



చాలా మంది భర్తలు వారి భార్యలను ప్రేమిస్తుంటారు. ఇందులో ఎటువంటి సందేహం లేదు. అయితే, ఈ ప్రేమ ఇల్లు లేదా పడకగదికే పరిమితమై ఉంటుంది. అదే భార్యపై ఉన్న ప్రేమ నలుగురిలో కూడా చూపించే భర్తలు ఉంటారు. వీరికి భార్య అంటే ఎనలేని ప్రేమ. ఇలాంటి భర్త దొరకడం ఆ భార్య అదృష్టం. ఈ లక్షణం ఉన్న భర్తకు భార్యపై ఎలాంటి పరిస్థితుల్లో కూడా కోపం రాదు. నలుగురిలో కోపం చూపించేవాడికన్నా.. అదే నలుగురిలో ప్రేమ చూపించినవాడంటేనే భార్యకి ఇష్టం. అలాంటి భర్తను ఎల్లప్పుడూ గౌరవిస్తుంది.

### సమయం కేటాయించడం.



ఈ రోజుల్లో చాలా మంది భర్తలు బిజి లైఫ్స్టైల్ గడుపుతున్నారు. ఆఫీస్, ఇల్లు, స్నేహితులు వీటికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. అదే భార్యకు మాత్రం కొంచెం కూడా సమయం కేటాయించరు. అయితే, భార్యల కోసం సమయాన్ని కేటాయించే భర్తలు కూడా ఉంటారు. ఇలాంటి వారు దొరకడం చాలా లక్కీ అని చెప్పొచ్చు. తన కోసం టైమ్ కేటాయించే భర్తంటే.. భార్యకు కూడా ఎంతో ఇష్టం. భార్యభర్తలు నాణ్యమైన సమయాన్ని తమ కోసం కేటాయించుకోవాలి. అప్పుడే ఒకరి సమస్యలు మరొకరు తెలుసుకుంటారు. మద్దతుగా నిలుస్తారు. మంచి భర్త కచ్చితంగా తన భార్యకు సమయం కేటాయిస్తాడు

### పనుల్లో సాయం చేయడం..




ఇంటి నిర్వహణలో భార్యాభర్తలిద్దరూ కీలకపాత్ర పోషిస్తారు. ఇద్దరూ కలిసి ఇంటి బాధ్యతల్ని మోస్తా-రు. ఇలాంటి పరిస్థితుల్లో ఇద్దరి ప్రాముఖ్యతను ఒకరికొకరు తెలుసుకోవాలి. భార్యాభర్తలిద్దరూ ఒకరి పనిని మరొకరు మెచ్చుకోవడం, ఒకరి అవసరాలను మరొకరు అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. చాలా ఇళ్లల్లో భార్యే అన్ని పనులు చేస్తుంది. ఎంతో కష్టపడి ఇంటి పనులు సమర్థవంతంగా నిర్వహిస్తుంది. తమ పనుల్లో సాయం చేసే భర్తంటే భార్యకు ఎంతో ఇష్టం. ఇలాంటి భర్తను ఎప్పుడూ గౌరవిస్తుంటుంది. భర్తలు సాయం చేస్తే భార్యలకు ఎక్కడ లేని సంతోషం.

### ఓపికతో వినడం..



ఏదైనా బంధం స్ట్రాంగ్గా, కలకాలం కొనసాగించాలంటే కమ్యూనికేషన్ చాలా అవ-సరం. అయితే, చాలా మంది భర్తలు తమ భాగస్వాములతో సరిగ్గా మాట్లాడరు. అంతేకాకుండా.. వాళ్లు చెప్పే వాటిపై శ్రద్ధ చూపరు. చాలా మంది భార్యలు తమ భార్యల మాటల్ని అస్సలు లెక్క చేయరు. దీంతో.. తమల్ని భర్తలు అర్థం చేసుకోవడం లేదంటూ భార్యలు చిరాకు పడతారు. అదే మంచి భర్త అయితే.. భార్య మాటల్ని శ్రద్ధగా వింటాడు. ఆమెకు తగిన గౌరవం ఇస్తాడు. ఇలాంటి భర్త ఉంటే భార్యలు ఎప్పుడూ గొడవపడరు.

### పిల్లల సంరక్షణ..



చాలా మంది భర్తలు.. పిల్లల పెంపకం సంరక్షణ బాధ్యత కేవలం భార్యకి మా-త్రమే అప్పగిస్తుంటారు. పిల్లలను ఒంటరిగా చూసుకోవడం వారికి కష్టంగా ఉంటుంది. ఇక, ఏదైనా జాబ్ చేసే భార్యకి ఇది మరింత కష్టమనే చెప్పాలి. అదే మంచి భర్త పిల్లల పెంపకం విషయంలో భార్యకు సాయం చేస్తుంటారు. పిల్లల సంరక్షణలో శ్రద్ధ చూపించే భర్తలంటే భార్యకు ఎనలేని గౌరవం. ఇలాంటి భర్తలపై ఎప్పుడూ కోప్పడరు.

గమనిక..ఇది సోషల్ సమాచారం మా-త్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల మానసిక ప్రవర్తన, పరిస్థితుల్ని బట్టి ఫలితాలుంటాయి. ఇది ఎవర్ని ఉద్దేశించినది కాదని పాఠకులు గమనించాలి. సమయం తెలుగు ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు.

